క్లుప్తంగా

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కొండాపూర్, బుద్దిపల్లి, గొల్లపల్లి, పెద్దంపేట గ్రామాల్లో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు బుధవారం ఇంటింటా పర్యటించి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాల వివరిస్తూ రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి మరోసారి విజయాన్ని అందించి అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇతర రాష్ట్రాలకు తెలంగాణ పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని, వచ్చే ఎన్నికల్లోనూ అమలు చేయబోయే పథకాలతో బీఆర్‌ఎస్ ప్రజలకు మరింత చేరువ కానుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ సత్తయ్య, నాయకులు రవి, స్థానికులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

లక్సెట్టిపేట: మండలంలోని రంగపేట, హన్మంతుపల్లి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే దివాకర్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

టీఎస్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపు దిశగా 'హెచ్‌ఆర్‌డీఏ'



ఓటు వేయాలని కోరుతున్న డాక్టర్ శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలో 17సంవత్సరాల తరువాత జరుగుతున్న టీఎస్‌ఎంసీ ఎన్నికల్లో హెచ్‌ఆర్‌డీఏ ప్యానెల్‌కి రాష్ట్రవ్యాప్తంగా అన్ని విభాగాల వైద్యుల నుంచి భారీ స్పందన లభించడం హర్షనీయమని ఉమ్మడి జిల్లా హెచ్‌ఆర్‌డీఏ ప్రెసిడెంట్ డాక్టర్ యెగ్గన శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఆర్‌డీఏ ప్యానల్ పోరాటం వల్లనే 17ఏళ్ల అనంతరం టీఎస్‌ఎంసీకి ఎన్నికలు నిర్వహిస్తున్నారని, వైద్యులకు, వైద్యవృత్తికి సంబంధించి ఎన్నో సమస్యలపై కోర్టుకు వెళ్లి, 40కి పైగా పిల్స్ వేసి గెలిచినట్లు తెలిపారు. టీఎస్‌ఎంసీ ఎన్నికల్లో అందరు వైద్యులు కలిసి బాధ్యతాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

'కేసీఆర్ అవినీతి పాలనపై పోరాటం'

పాతమంచిర్యాల: కేసీఆర్ చేస్తున్న అవినీతి పాలన అంతమొందించడానికి తెలంగాణ ఉద్యమ శక్తులు ఒక్కటై ఉద్యమించాలని తెలంగాణ జనసమితి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రజల ఐక్యతకు మైలురాయిగా నిలిచిన మిలియన్ మార్చ్ స్ఫూర్తితో, కేసీఆర్ అవినీతి పాలనపై పోరాటం చేసి తెలంగాణను కాపాడుకోవాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను వంచిస్తున్నారని, అమరుల త్యాగాలను, ఉద్యమ ఆకాంక్షలను మర్చిపోయి అక్రమ సంపాదన ఆధిపత్య రాజకీయాల కోసం తెలంగాణ ప్రాంత ప్రయోజనాలను తాకట్టు పెట్టారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, యువకుల ఆత్మహత్యలకు కారకుడయ్యారన్నారు. తన ఎన్నికల ప్రయోజనాల కోసం తెలంగాణ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చి, అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చారని విమర్శించారు. తెలంగాణను కాపాడుకోవడానికి ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు, విద్యావంతులు ఏకమై ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గద్దెదించే వరకు ఉద్యమాలు, పోరాటాలకు సిద్ధం కావాలన్నారు.

'అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా'



కాంపల్లి ఉదయ్‌కాంత్, హైకోర్టు న్యాయవాది

బెల్లంపల్లి: ఈ సారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు బెల్లంపల్లికి చెందిన హైకోర్టు న్యాయవాది కాంపల్లి ఉదయ్‌కాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. 2018, 2023ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్ ఆశించి భంగపడినట్లు తెలిపారు. పార్టీని నమ్ముకుని ఎన్ని సేవలు చేసినా, గుర్తింపు లేకుండా పోయిందని పేర్కొన్నారు. అర్హత లేని నాయకులకు టిక్కెట్లు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని, బాధ్యతగా ప్రజలకు సేవలు చేసే నాయకులు లేరని తెలిపారు. న్యాయవాదిగా, చట్టాలు తెలిసిన వ్యక్తిగా చట్టసభలో ఉండే పూర్తి అర్హత తనకు ఉందని తెలిపారు. ప్రజల్లో తనకు మంచి మనుగడ ఉందని, ప్రజలు తనను ఆశీర్వదించాలని ఆయన కోరారు. బెల్లంపల్లి స్థానికుడిగా ప్రజలతో ఉన్న సత్సంబంధాలతో ప్రజలే తనను గెలిపించుకుని అసెంబ్లీకి పంపిస్తారని, తాను గెలుపు సాధించడం తథ్యమని పేర్కొన్నారు.

గ్యాంగ్‌ల అలజడి!

- పట్టణాల్లో పెరిగిన ప్రైవేట్ సెటిల్‌మెంట్లు
- రౌడీలను పెంచిపోషిస్తున్న రియల్ వ్యాపారులు!
- మద్యం, గంజాయి మత్తులో రెచ్చిపోతున్న పోకిరీలు
- బహిరంగ ప్రదేశాల్లోనే నిత్యం గొడవలు
- అటకెక్కిన 'ఆపరేషన్ ఛబుత్ర'



వినాయక నిమజ్జనం రోజు జరిగిన గొడవలో కర్రలతో దాడులకు పాల్పడుతున్న దృశ్యం

మంచిర్యాలక్రైం: జిల్లాలో పోకిరీల ఆగడాలు, సెటిల్‌మెంట్ గ్యాంగ్‌ల అలజడి పెరిగిపోయింది. మద్యం, గంజాయి మత్తులో యువత ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఆకతాయిల ఆగడాలను కట్టడి చేసేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన పోలీస్ కమిషనర్ వీ.సత్యనారాయణ 2019నవంబర్ 22న 'ఆపరేషన్ ఛబుత్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమం ద్వారా రాత్రి సమయంలో సరదాకు రోడ్లపైకి వచ్చి జల్సాలకు పాల్పడుతున్న వారిని రైల్వేస్టేషన్, బస్టాండ్, వైన్స్‌లు ఉన్న ప్రాంతాల్లో, వీధుల్లో సైతం గుంపులుగుంపులుగా తిరుగుతూ ప్రజలను ఇబ్బంది పెడుతున్న వారిపై దృష్టి సారించారు. ప్రత్యేక పోలీస్ బృందాలతో పెట్రోలింగ్ నిర్వహించారు. లాక్‌డౌన్ కారణంగా ఆపరేషన్ ఛబుత్ర అటకెక్కింది. జిల్లా కేంద్రంలో సిబ్బంది కొరతతో ఛబుత్రకు ఫుల్‌స్టాప్ పడింది. దీంతో మళ్లీ పోకిరీలా ఆగడాలు మితిమీరి పోతున్నాయి. ఇటు పోకిరీలు, అటు సెటిల్‌మెంట్ గ్యాంగ్ ముఠాలు జిల్లాలో హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. ఏ సమస్య అయిన పరిష్కారం జరగడం లేదంటే పోలీసులను ఆశ్రయించకుండా, బాధితులు సెటిల్‌మెంట్ ముఠాలను ఆశ్రయిస్తున్నారు. వెంటనే సెటిల్‌మెంట్ గ్యాంగులు రంగంలోకి దిగుతున్నాయి. అధికశాతం భూ వివాదాల్లో, ఫైనాన్స్ సెటిల్ మెంట్లల్లో ఈ ముఠాలు భాగస్వాములవుతున్నారు. కేసుకో లెక్కా అంటూ ఒప్పందాలు చేసుకుంటూ, సెటిల్‌మెంట్లకు దిగుతున్నారు.

బహిరంగ ప్రదేశాలు, టీ స్టాళ్లు, పాన్ టేలాలే అడ్డాలు..

జిల్లా, పట్టణాల్లోని బస్టాండ్, టీ స్టాళ్లు, పాన్ టేలాలు రాత్రి 12గంటల వరకు నడుస్తుండడంతో పోకిరీలకు, మాఫీయ గ్యాంగ్‌లకు అడ్డాగా మారాయి.

భూ వివాదాలే అధికం...

జిల్లాలో భూ వివాదాలే అధికంగా ఉంటున్నాయి. జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సుమారు రోజుకు 5నుంచి 10వరకు భూ వివాదమైన ఫిర్యాదులు అందుతున్నాయి. సమస్య పరిష్కారం కాని పక్షంలో మాఫీయా ముఠాలను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో గొడువలు చోటుచేసుకుంటున్నాయి.



రంగంలోకి రౌడీముఠాలు..

జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత రోజురోజుకూ అభివృద్ధి చెందడంతో మంచిర్యాల చుట్టు పక్కల భూముల ధరలు పెరిగిపోయాయి. దీంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారంలోకి ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నాయకులు అడుగుపెట్టారు. వీరంతా కొందరు పోకిరీలను పోగుచేసి, వారికి తాగిపిస్తూ, తినిపిస్తూ రౌడీగ్యాంగ్‌లను పెంచి పోషిస్తున్నట్లు సమాచారం. భూ వివాదాల్లో ఇబ్బందులు ఎదురైతే.. గొడవలకు దారితీస్తే రౌడీ ముఠాలను రంగంలోకి దింపుతున్నారు. ఆ వ్యక్తులకు సంబంధం లేనట్లుగా గొడవలు సృష్టించి, దాడులకు పాల్పడుతున్నారు.

ఇటీవల జరిగిన సంఘటనలు

- వినాయక చవితి నిమజ్జనం రోజున మద్యం మత్తులో జరిగిన చిన్న గొడవ రెండు వర్గాల మధ్య పెద్ద గొడవకు దారి తీసింది. క్రికెట్ బ్యాట్లు, ఇనుప రాడ్లతో దాడులు చేసుకొని బీబత్సం సృష్టించారు. ఈ దాడిలో సుమారు 20 మందికి పైగా ఉండడం గమనార్హం. రెండు వర్గాలకు చెందిన వారు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేయగా, ఓ రియల్‌ఎస్టేట్ వ్యాపారి హస్తం ఉన్నట్లు తేలింది. ఈ కేసులో ఆరుగురిని రిమాండ్‌కు తరలించారు. ఆ వ్యాపారిపై సైతం కేసు నమోదు చేయగా అతడు ముందస్తు బెయిల్ పొందినట్లు సమాచారం.
- ఈ నెల 8న జిల్లా కేంద్రంలోని లక్ష్మి థియేటర్ సమీపంలో ఓ వైన్స్ వద్ద రాత్రి రెండు వర్గాల మధ్య మద్యం మత్తులో దాడులకు పాల్పడ్డారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో పోలీసులు స్పందించారు. వీడియో ఆధారంగా దాడికి పాల్పడిన వారిని గుర్తించి వారిని పిలిపించే ప్రయత్నంలో పోలీసులు ఉన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



జిల్లాలో పోకిరీల ఆగడాలను, రౌడీగ్యాంగ్ ముఠాలపై చర్యలు తీసుకుంటాం. వినాయక నిమజ్జనం తర్వాత జరిగిన గొడవకు కారణమైన వారిని గుర్తించి కేసు నమోదు చేశాం. నిఘా ఏర్పాటు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు.

– సుధీర్ రాంనాథ్ కేకన్, డీసీపీ

'కలిసికట్టుగా పని చేస్తేనే విజయం'



మాట్లాడుతున్న గుండ్లసోమారం ఎంపీటీసీ

నెన్నెల: కాంగ్రెస్ కార్యకర్తలంతా కలిసికట్టుగా పని చేస్తేనే బెల్లంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని గుండ్లసోమారం ఎంపీటీసీ దాగం రమేష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కొద్ది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ పార్టీని బలోపేతం చేశామన్నారు. ప్రస్తుత రాజకీయ కోణంలో సీనియర్లకు, పార్టీ ప్రజాప్రతినిధులకు ఎలాంటి ప్రాధాన్యం లేకుండా పోయిందన్నారు. నూతనంగా పార్టీలో చేరిన వారికి పార్టీ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజల ముందుకు తీసుకెళ్లిన సీనియర్ నాయకులకు ఎలాంటి సమాచారం లేకుండా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, ఇలాంటి దోరణిని మార్చుకోవాలని హెచ్చరించారు. సీనియర్లను గుర్తించి కలిసి పనిచేయకపోతే బెల్లంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జంగాల్‌పేట ఎంపీటీసీ గొలుసుల శిరీష, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్, యూత్ అధ్యక్షుడు లావుడియా రమేష్, డీసీసీ సభ్యులు గట్టు బానేష్, మైనార్టీ అధ్యక్షులు మొహిద్‌ఖాన్ పాల్గొన్నారు.

భూమిపూజ

జన్నారం: మండలకేంద్రంలోని శ్రీ శివభక్త మార్కండేయ ఆలయం వద్ద నూతనంగా నిర్మించే నవగ్రహాల ప్రతిష్ఠకు బుధవారం పద్మశాలీ సంఘం అధ్యక్షుడు చెటుపల్లి గంగయ్య భూమిపూజ చేశారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం నవగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు గంగయ్య తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజేశ్వరి సంఘం నాయకులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలకు 50 ఏళ్లు



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ సభ్యులు

మంచిర్యాలటౌన్: లయన్స్ క్లబ్ సేవలను ప్రారంభించి 50ఏళ్లలోకి అడుగు పెడుతున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ ఇయర్ వేడుకలను జిల్లా కేంద్రంలో బుధవారం కేక్ కట్ చేసి ప్రారంభించారు. లయన్స్ క్లబ్ ద్వారా సేవలను అందించిన పట్టణ ప్రముఖులు జీ.నరసింహారెడ్డి, జీ.హనుమంతరావు, వి.రత్నారెడ్డి, ముత్యాల శంకరయ్య, మోటూరు నారాయణ, వాసుదేవ్ కేడియా, డాక్టర్ నాగేశ్వర్‌రావు, డాక్టర్ పి.నారాయణతో పాటు, పలువురు ప్రముఖులతో కూడిన చిత్ర పటాల ఫ్లెక్సీని విడుదల చేశారు. అనంతరం పేద ప్రజలకు బ్లాంకెట్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్లు ఏ.బాలాజీ, వి. మధుసూదన్ రెడ్డి, మంచిర్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఏ.బాలాజీ, కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, కె.సుగుణాకర్ రెడ్డి, డేగ బాబు, వినయ్‌కుమార్, గోలి రాము, సిరిపురం శ్రీనివాస్, ఇరుకుల్ల ఆనంద్, గుండా శ్రీనివాస్, దొంతుల ముఖేష్, బాల్‌మోహన్, శ్రీధర్, వీరస్వామి, దొంతుల ముఖేశ్, బాల్ మోహన్, శ్రీధర్, వీరస్వామి, పి. సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి శోభాయాత్ర

రామకృష్ణాపూర్: నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలందుకున్న దుర్గామాతల ప్రతిమలను బుధవారం మంచిర్యాల గోదావరిలో నిమజ్జనం చేశారు. పట్టణంలోని సూపర్‌బాజర్ సెంటర్, బీజోన్, రామాలయం తదితర ప్రాంతాల నుంచి నిమజ్జన శోభాయాత్ర ఉత్సాహంగా సాగింది. యువకులు, చిన్నారులు, మహిళలు నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

మంచిర్యాలఅర్బన్: శరన్నవరాత్రుల్లో భాగంగా తొమ్మిది రోజులుగా భక్తుల పూజలు అందుకున్న దుర్గాదేవికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి బుధవారం నిమజ్జన మహోత్సవం చేపట్టారు. స్థానిక మణికంఠ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి ఉత్సవ విగ్రహానికి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గోదావరి నదికి నిమజ్జనానికి తరలించారు. మహిళల కోలాటా నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జైపూర్: మండలంలోని కుందారం గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు అత్యంత నియమనిష్టలతో వైభవోపేతంగా పూజలు నిర్వహించారు. బుధవారం చివరి రోజున ఉదయం పూజలు నిర్వహించి సాయంత్రం దుర్గామాత అమ్మవారి శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు, యువకులు, పిల్లలు అంతా ఆటాపాటలతో డ్యాన్సులు చేశారు. మహిళలలు ప్రత్యేకంగా కోలాటాలు వేశారు. అనంతరం గోదావరి నదిలో దుర్గామాత అమ్మవారిని నిమర్జనం చేశారు.

కాసిపేట: మండలంలోని సోమగూడెం, కాసిపేటలలో బుధవారం దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఆటపాటలతో ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి మంచిర్యాల గోదావరికి తరలించారు.



రామకృష్ణాపూర్‌లో దుర్గామాత శోభాయాత్రలో భక్తుల నృత్యం



కుందారంలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



జిల్లా కేంద్రంలో మణికంఠ గణేష్ మండలి ఆధ్వర్యంలో దుర్గామాత శోభాయాత్ర



కాసిపేట: కోలాటం ఆడుతున్న మహిళలు



రామకృష్ణాపూర్‌లో ఊరేగింపులో భక్తులు



ఆర్కేపీలో కోలాటం ఆడుతున్న మహిళలు, చిన్నారులు



సోమగూడెంలో దుర్గామాత ఊరేగింపు

'కాంగ్రెస్ గ్యారంటీ హామీలు అమలు చేస్తాం'

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ హామీలను తప్పకుండా అమలు చేస్తామని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని హమాలివాడలో బుధవారం గడపగడపకూ వెళ్లి, కాంగ్రెస్ గ్యారంటీ హామీలను వివరించారు. నవంబర్ 30వ తేదీన జరిగే శాసనసభ ఎన్నికల్లో మంచిర్యాల అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును చేతి గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

గడపగడపకూ కాంగ్రెస్ ప్రచారం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్, రాజేశ్వర్‌రావుపల్లె గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గడపగడపకూ వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసేలా ప్రవేశపెట్టే ఆరు గ్యారంటీ హామీలను ఇంటింటికీ వెళ్తూ అందరికీ వివరించారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావు నియోజకవర్గంలో విస్తృతంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలను తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచి భారీ మెజారిటీతో గెలుపు అందించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెలిమెల చంద్రమౌళి, నల్ల వెంకటేశ్, అంజి, సాంబారి కుటుంబరావు, తిరుపతి, భూమేశ్, సత్యనారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.



హమాలివాడలో ప్రచారం చేస్తున్న సురేఖ

పోస్టర్ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: ఆదివాసీ బిరుదుగోండ్ (తోటి) సాంస్కృతిక కళాకారుడు వెద్మరాము వర్ధంతిని ఈ నెల 26న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణి మండలంలోని ఏదులాపాడ్ గ్రామంలో నిర్వహించనున్నట్లు ఆదివాసీ బిరుదుగోండ్ తోటి సేవాసంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆత్రం రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా వర్ధంతి పోస్టర్‌ను జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆదివాసీ బిరుదుగోండ్ సేవా సంఘం జిల్లా కమిటీ సభ్యులు కుర్సింగ శంకర్, గోడం శ్రీనివాస్, రాజవేణు, లక్ష్మిరాజం, వెంకట్రాజం, మర్సకోల శంకర్, ఆత్రం రాజయ్య తదితరులు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కొనసాగుతున్న బతుకమ్మ సంబురాలు

చెన్నూర్: పట్టణంలోని బేతాళవాడ, కింది గూడెం, నలగొండపోచమ్మ వాడల్లో బుధవారం బతుకమ్మ సంబురాలు కొనసాగాయి. బతుకమ్మ ఆడే మహిళలకు తాగునీరు, అల్పాహారం సౌకర్యాన్ని మాల మహానాడు నాయకులు ఏర్పాటు చేశారు. అనంతరం జాతీయ రహదారి పక్కన గల శనిగకుంటలో నిమజ్జనం చేశారు.



'మేనిఫెస్టో ప్రజల్లోకి తీసుకెళ్దాం'

జన్నారం: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రూపొందించిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, నియోజకవర్గ అభ్యర్థి గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని జన్నారం ఎంపీటీసీ ఎండీ రియాజోద్దీన్ పేర్కొన్నారు. జన్నారం గ్రామ బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం బుధవారం హరిత రీసర్ట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్‌నాయక్ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఎన్నికలు జరిగే వరకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. పార్టీ కోసం ఇప్పుడు పని చేస్తే, పార్టీ మనకు తగిన గుర్తింపు తెస్తుందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడిగా శ్యాంసుందర్

దండేపల్లి: ఎస్ఎస్‌యూఐ దండేపల్లి మండల అధ్యక్షుడిగా మండలంలోని కొర్విచెల్మ గ్రామానికి చెందిన కార్యూరి శ్యాంసుందర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ బుధవారం నియామకపత్రం అందించారు. విద్యారంగ సమస్యలపై పోరాడటంతో పాటు, ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు తనవంతు కృషిచేస్తానని శ్యాంసుందర్ తెలిపారు.

పార్టీల్లో చేరికలు

వేమనపల్లి: మండలంలో బీఆర్‌ఎస్ నుంచి జిల్లెల మాజీ సర్పంచ్ మధుకర్‌గౌడ్ గ్రామానికి చెందిన 50మంది కార్యకర్తలు ఎంపీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్ ఆలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కేతన్‌పల్లి గ్రామానికి చెందిన ఎంఆర్‌పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు సిపెల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సిపెల్లి అంకులు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు లక్ష్మీకాంత్, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

భీమిని: మండలంలోని వీగాం గ్రామపంచాయతీలో బుధవారం పలువురు కాంగ్రెస్‌లో చేరగా, సీనియర్ నాయకుడు మాదవరపు నర్సింగరావు, భీమిని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాదం లక్ష్మీనారాయణ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వీగాం మాజీ సర్పంచ్ పంజాల రాజాగౌడ్‌తో పాటు నాయకులు రవీందర్, ఐలయ్య, తులసీరామాగౌడ్, దుర్గం ప్రభాకర్, సత్యనారాయణ, భీరయ్య, పోశం తదితరులు ఉన్నారు.

బహుమతులు అందజేత

జన్నారం: బతుకమ్మ సంబురాల్లో భాగంగా ఉత్తమ బతుకమ్మ ప్రదర్శించిన మహిళలకు బుధవారం పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్ బహుమతులు అందజేశారు. ఉత్తమ ప్రదర్శన చేసిన వారి పేర్లను రాసి లక్కి డ్రా రూపంలో బహుమతులకు ఎంపిక చేసినట్లు సర్పంచ్ తెలిపారు. మొదటి బహుమతి బోదసు పద్మ, రెండో బహుమతి కామెర రాంబాయి, మూడో బహుమతి హేమలత గెలుచుకున్నారని, మరో 20మంది మహిళలకు కన్సలేషన్ బహుమతులు అందజేసినట్లు సర్పంచ్ తెలిపారు. నిర్వాహకులు, దాతలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

దండేపల్లి: మండలంలోని మాదాపూర్‌లో నూతనంగా నిర్మించే మడేలయ్య స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు.